
అడ్డతీగలలో బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో దుర్గమ్మవారు


గంగవరంలో పూజలు చేస్తున్న భక్తులు


దూసరపాము దుర్గమ్మ ఆలయంలో బాలా త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు

దసరా ఉత్సవాలు ప్రారంభం

- ముస్తాబైన ఆలయాలు
- దుర్గమ్మకు ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు

పెదబయలు/కొయ్యూరు/సీలేరు/జి.మాడుగుల/అడ్డతీగల/గంగవరం/రాజవొమ్మంగి: దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా సోమవారం ప్రారంభమయ్యాయి. వాడవాడలా ఏర్పాటుచేసిన మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు గరగలను ఊరేగించారు. మండప ప్రాంగణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భవానీ భక్తులు అమ్మవారి మాలధారణ చేశారు. జై..జై..దుర్గమ్మ నామస్మరణతో ఈ ప్రాంతం మార్మోగింది. మోటార్ యూనియన్ నాయకులు కిశోర్, అంజిబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. కొయ్యూరులోని మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. త్రిపుర సుందరిదేవీ అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. సీలేరులో ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్సవాలను ప్రారంభించారు. దారకొండలో కూడా దసరా ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. జి.మాడుగుల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు బందశవీధిలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అడ్డతీగలలోని శ్రీదేవి ఆలయంలో అమ్మవారికి నూతన వస్త్రాలతో పాటు ఆభరణాలు, పూలమాలలతో ప్రత్యేక అలంకరించి, పూజలు చేశారు. పవనగిరి క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. క్షేత్రం వ్యవస్థాపకులు వెంకటరామయ్య ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గంగవరంలోని రాజరాజేశ్వరి దేవాలయంలో అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రాజవొమ్మంగిలోని జడ్డంగి, శరభవరం, చెరకుంపాలెం, వట్టిగెడ్డ తదితర గ్రామాల్లోని ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకొన్నారు.


కొయ్యూరులో గరగల ఊరేగింపులో భక్తులు


పెదబయలులో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


సీలేరులోని ఊరేగింపులో భక్తులు


జి.మాడుగులలో అమ్మవారికి పూజలు

- కోతకు గురైన రహదారులు
- జారిపడుతున్న వాహనచోదకులు
- పెరుగుతున్న ప్రమాదాలు
- ఆందోళనలో గ్రామస్తులు

చిత్తడి దారులు


కోతకు గురైన రంగిసింగిపాడు రోడ్డు

పాడేరు రూరల్: మండంలోని మారుమూల గ్రామాల రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు మాయంగా మారాయి. మండలంలో వంట్లామామిడి, సలుగు, మినుములూరు, తుంపాడ, వివిద పంచాయతీల పరిధిలోని ఈదులపాలెం, తూరుమామిడి, మెట్టుఊరు తదితర గ్రామాల రహదారులు చిత్తడి మారాయి. వాహనచోదకులు జారిపడి గాయాలపాలవుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు దిలీప్,కొర్రా పాల్,తామర్ల బాలన్న,నాగరాజులు,ఈశ్వరరావులు ఆందోళన చెందుతున్నారు. గత కొద్దిరోజుల నుంచి ఎడతెరిపి లేకుండ కురుస్తున్న వర్షాలకు రహదారులు కోతకు గురై గోతులమయంగా మారిందని దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని శివారు గ్రామాల రహదారులు దారుణంగా ఉన్నాయి. రాళ్లు తేలి అధ్వానంగా మారాయి. అరకు సంత నుంచి కొర్రాయి మీదుగా ఒడిశాకు వెళ్లే రోడ్డులో కొర్రాయి వద్ద కాజ్‌వే ఎత్తు తక్కువ ఉంది. వర్షం కురిసినపుడు రహదారిని వర్షపునీరు ముంచెత్తుతోంది.ఈ రోడ్డు మీదుగా కొల్లాపుట్టు పంచాయతీ అలాగే ఒడిశాకు సంబంధించి గ్రామాలు పుక్కలి, సిమిలిగూడ, కొర్రపుట్టు, జైపూర్ మీదుగా చత్తీస్‌ఘడ్ మీదుగా శ్రీకాకుళం చేరవచ్చు.కొర్రాయి పంచాయతీ బీటీ రోడ్డు నుంచి గత్తరజీలడ గ్రామానికి మట్టి రోడ్డు చిత్తడిగా మారింది. తూటంగి పంచాయతీ నేరేడువలస రహదారి అధ్వానంగా ఉంది. వర్షాలు పడడంతో చిత్తడిగా మారింది. తూటంగి గ్రామం నుంచి నేరేడువలస వరకు ఉన్న ఈ రహదారి మీదుగా మూడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కొర్రాయి పంచాయతీ గత్తరజిలేడ కొర్రాయి బీటీ రోడ్డు నుంచి 2 కిలోమీటర్లు రహదారి రాళ్లు తేలి దారుణంగా మారింది.


తూటంగి పంచాయతీ నేరుడువలస రహదారి దుస్థితి

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ జంక్షన్ నుంచి దారెల, పేటమాలిపుట్టు వెళ్లే పి.ఆర్.రోడ్డు గోతులమయంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గోతుల్లో వర్షపు నీరు చేరి వాహనచోదకులకు ఇబ్బందిగా మారింది. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఈ రహదారి పరిస్థితి ఇలా ఉన్నప్పటికి అధికారులు కనీసం స్పందించడం లేదని చెబుతున్నారు. ప్రతి రోజు ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతూ రాకపోకలు చేస్తున్నారు.సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోపరిమామిడి గ్రామ సమీపంలో కల్వర్టు సైతం పాడై ప్రమాదభరితంగా ఉందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పాడైన రోడ్డును బాగుచేయాలని, రవాణా కష్టాలు తీర్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.


దారెల మార్గంలో రాళ్లు తేలిన రహదారి

క్లుప్తంగా

అభివృద్ధి పనులపై శిక్షణ తరగతులు

చింతపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 24, 25 తేదీల్లో స్థానిక సుస్థిరత అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు.జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాదికారి అదేశాల మేరకు చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల పరిధిలో ఉన్న సర్పంచ్‌లు, కార్యదర్శులకు చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు.సర్పంచ్‌లు విధిగా శిక్షణకు హాజరయ్యే విధంగా కార్యదర్శులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన ర్యాలీ


సీలేరులో బైక్ ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

సీలేరు: విద్యుత్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని గత వారం రోజులుగా చేపడుతున్న వివిధ నిరసనలు సీలేరు కాంప్లెక్స్‌లో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం సీలేరులో ఉద్యోగులు తక్షణమే పీఆర్సీ అమలు, వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ దశలవారీగా ఆందోళన చేపడుతున్నారు ఇందులో భాగంగానే బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం సమస్యల డిమాండ్ చేయకపోతే జేఏసీ పిలుపుమేరకు మరిన్ని నిరసనలు చేపడతామని జేఏసీ నాయకుడు సత్తిబాబు తెలిపారు. ర్యాలీలో భవాని శంకర్, రాజు, శివప్రసాద్. నాగేశ్వరరావు. ఐనాడ శివ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు : తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర విద్యుత్ జేఏసీ ఉద్యోగుల పిలుపు మేరకు సోమవారం పాడేరులో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. పాత బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి, కలెక్టరేట్‌లో అల్లూరి సీతామరామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అందజేశారు.


పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

పేదల ఆర్థికాభివృద్ధికి కృషి


శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు

రంపచోడవరం: పేదలను అభివృద్ధి చెందే విధంగా అందరూ కృషి చేయాలని జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి పీఏల్ ప్రసాద్ అన్నారు. వైటీసీలో పీ4 బంగారు కుటుంబాలు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ మండలం నుంచి మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి స్వర్ణాంధ్ర పీ4 పౌండేషన్ ద్వారా ఈ నెల 24,25 తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. డీఎస్‌వో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వం



అరకులోయ గిరిజన మ్యూజియం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు


సీలేరులో సీఐటీయూ కార్యాలయం వద్ద నిరసన

అరకులోయటౌన్: ప్రభుత్వం కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా పెట్టుబడి దారుల కోసమే పనిచేస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు విమర్శించారు. కార్మికుల పని గంటల పెంపు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సోమవారం జిల్లా యూనిట్ అరకులోయలో ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడారు. 8 గంటల పని సమయాన్ని 13 గంటలకు పెంచడం అన్యాయమన్నారు.

మహిళ కార్మికుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు. కుటుంబ బాగోగులు చూసుకునే పరిస్థితి ఉండదన్నారు. కనీస వేతన చట్టం, అలవెన్సులు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగాల శాశ్వతీకరణ, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి అంశాలను పట్టించుకోని ప్రభుత్వం పని గంటలు పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. కార్మిక చట్టాలను కాలరాస్తోందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా అల్లూరి జిల్లాలో ఉధృత పోరాటాలు తప్పవని ఆయన హెచ్చరించారు. గిరిజన మ్యూజియం కార్మికులు పాల్గొన్నారు.

సీలేరు: కార్మికులు పని గంటల పెంపు విధానాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

నాయకుడు చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ కార్మికుల పని గంటల పెంపు యోచనను ప్రభుత్వ తక్షణమే విరమించాలని డిమాండ్ చేశారు. నేతలు రాంబాబు. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

169 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ముంచంగిపుట్టు: మండలంలోని లబ్బూరు, రూడకోట పీహెచ్‌సీలలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన వచ్చింది.కంటి సమస్యలతో బాధపడుతున్న 169 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. మందులు అందజేశారు.ఈ సందర్భంగా మండల ఆప్తామాలిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ తీవ్రమైన కంటి సమస్యతో బాధపడుతున్న 48 మందిని శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్టు తెలిపారు. వీరిని బస్సులలో విజయనగరం తరలించామని, శస్త్రచికిత్సల సమయంలో ఉచితంగా భోజనం, వసతి మూడు రోజులు పాటు కల్పించనున్నట్టు తెలిపారు. వైద్యాధికారి సత్యారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


లబ్బూరు పీహెచ్‌సీలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్యాంప్రసాద్

నిర్వాసితుల సమస్యలపై వినతి

వి.ఆర్.పురం; చింతరేవుపల్లి గుండుగూడెం గ్రామాల నిర్వాసితులకు ఒకేచోట పునరావాసం కల్పించాలని సర్పంచ్ పిట్టా రామరావు ఎస్టీ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోటం జయరాజు, ఎస్‌డీసీ బాలకృష్ణ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా చింతరేవుపల్లి పీడీఎఫ్ 160 గుండుగూడెం పీడీఎఫ్ 55 ఆయా గ్రామస్తులు అనువైన చోట పునరావాసం కల్పించాలని కోరారు. నేతలు రామారావు, బాలరాజు, సత్యనారాయణ, రవి, రామారావు తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌డీసీ బాలకృష్ణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పంద్రప్రోలులో సూచనలిస్తున్న సీడీపీవో ఆదిలక్ష్మి

గంగవరం: మండలంలో పంద్రప్రోలు అంగన్‌వాడీ కేంద్రం నందు పోషణ మహా కార్యక్రమం సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. పోషణ మహా కార్యక్రమంలో భాగంగా ప్రీస్కూల్ పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట, పాటల, విద్య నేర్పించడం జరుగుతుందన్నారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. సూపర్‌వైజర్ కుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల అవకతవకలపై చర్యలకు డిమాండ్

వి.ఆర్.పురం: మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయతీ నిధులు అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొవాలని ఎంపీడీవో ఇమ్మానియేల్‌కు సోమవారం బీజేపీ నాయకులు రత్తయ్య, నాగేశ్వరరావు, శంకరయ్య, సుబ్బారావు తదితరులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెద్దమట్టపల్లి సర్పంచ్ పాలకవర్గం అనుమతి లేకుండా పంచాయతీ నిధులు డ్రా చేసి దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఎంపీడీవో ఇమ్మానియేల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గ్రామాల అభివృద్ధికి కృషి


ఆది సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అక్కమ్మ

గంగవరం : కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో మౌలిక కల్పనే లక్ష్యంగా ప్రవేశంపెట్టిన ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆది సేవా కేంద్రాన్ని సర్పంచ్ కలుముల అక్కమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. మాజీ ఎంపీపీ తీగల ప్రభ, పెసా ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, కార్యదర్శి చిన్నిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు బుల్లియమ్మ , చిన్నారావు, స్థానిక ఆదివాసీ నాయకులు సిద్దు , సత్యనారాయణమ్మ, సారపు పావని, సత్యవేణి, పంచాయతీ కార్యదర్శ శ్రీనివాస్, గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామప్రజలు పాలొన్నారు.

రహదారి సమస్యపై పీవోకు వినతి


ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

రాజవొమ్మంగి: మండలంలోని కొమరాపురం నుంచి వాతంగి మీదుగా లోదొడ్డి గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా పాడయ్యి, పెద్ద పెద్ద గోతులు పడిందని గ్రామస్తులు సోమవారం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌కు వినతి పత్రం ఇచ్చారు. రంపచోడవరంలో జరిగిన గ్రీవెన్స్‌లో వాతంగి ఉప సర్పంచ్ రాళ్లగడ్డ అర్జున్‌తో పాటు ప్రజలు రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టండి అంటూ అర్జీ పెట్టారు. 20 కిలోమీటర్ల పొడవునా ఈ రోడ్ పూర్తిగా పాడైందని, వర్షం వస్తే చాలా ఇబ్బంది పడుతున్నామని వినతిలో పేర్కొన్నారు. రహదారి కోతకు గురవడంతో ద్విచక్రవాహనాలు సైతం తిరగలేని పరిస్థితి నెలకొందన్నారు.

వందనాపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ గన్నెలపుట్టు, వందనాపల్లి గిరిజన గ్రామాలకు విద్యుత్ లోఓల్టేజీ సమస్య తీరింది.గత 15 సంవత్సరాలుగా లోఓల్టేజీతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. దీంతో స్థానిక సర్పంచ్ రత్న, ఎంపీటీసీ కొండమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రావు, జగన్నాథం తదితరులు రెండు గ్రామాల గిరిజనులతో అనేకసార్లు పాడేరులో నిర్వహించిన స్పందన, మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. ఎట్టకేలకు ఆయా రెండు గ్రామాలకు లోఓల్టేజీ సమస్య పరిష్కారమైంది.సోమవారం విద్యుత్ శాఖ అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల నేత మోహన్ ఆధ్వర్యంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చి, విద్యుత్ వైర్లు వేసి లోఓల్టేజీ సమస్యను తీర్చారు. దీంతో గన్నెలపుట్టు, వందనాపల్లి గ్రామస్తులు ఆయా నేతలకు, విద్యుత్‌శాఖ అధికారులకు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.


వందనాపల్లిలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

మండల అభివృద్ధికి కృషి చేయాలి

ముంచంగిపుట్టు: మండల అభివృద్ధికి నిత్యం అందుబాటులో ఉంటూ కృషి చేయాలని నూతన ఎంపీడీవో ధర్మారావును ఎంపీపీ అరిసెల సీతమ్మ కోరరు. సోమవారం నూతన ఎంపీడీవోను ఎంపీపీ, ఎంపీటీసీలు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు. మండలంలో 23 పంచాయతీల పరిస్థితులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాలని, ఎంపీటీసీలు, సర్పంచుల నుంచి పూర్తి సహకారం అందించడం జరుగుతుందని ఎంపీపీ సీతమ్మ అన్నారు. వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, భాగ్యవతి, సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సభ్యులు గణపతి, సుబ్బలక్ష్మీ, మల్లికార్జున్, నాయకులు జయదేవ్, అప్పారావు, సాధురాం తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు అభినందనలు తెలియజేస్తున్న ఎంపీపీ సీతమ్మ, ఎంపీటీసీలు, నేతలు

గ్రామాల్లో పశువులకు టీకాలు


బొండ్రుగూడలో పశువుల వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న వైద్యులు


అంతర్లలో టీకాలు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ చంద్రశేఖర్

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ బొండ్రుగూడ గ్రామంలో సోమవారం జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పశువులకు వ్యాక్సినేషన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ దొర నీలకంఠం మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. సుమారు 237 పశువులకు టీకాలు వేశారు. పశు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. రైతులు పశువుల పెంపకంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని,పాడి అభివృద్ధి కోసం రైతులు పశు వైద్య సిబ్బంది సలహాలు తప్పకుండా పాటించాలని కోరారు. పశు వైద్య సిబ్బంది వరలక్ష్మీ, వాసుదేవయ్య, బుద్దు, అప్పలరాజు, పరుశురాం, రాంనాయుడు పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో 21,200 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేసినట్టు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి చంద్రశేఖర్ అన్నారు. ఆయన సోమవారం అంతర్లలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులలో గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం జాతీయ పశువ్యాధినియంత్రణ పథకంలో భాగంగా వచ్చేనెల 15 వరకూ ఈ టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులకు జ్వరం రావడం మేత మందగించడం వంటి లక్షణాలతో నీరసించిపోవడం జరుగుతుందన్నారు. ఎల్ఎస్ఏ నాగరాజు,ఏహెచ్ఏ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రత తప్పనిసరి

పాడేరు/డుంబ్రిగుడ/చింతపల్లి/కూనవరం/: జిల్లా వ్యాప్తంగా స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలకు పాటు క్యాన్సర్, మధుమేహం తదితర వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక సారించాలన్నారు. అనారోగ్యమైతే తక్షణమే వైద్య సేవలు పొందాలని సూచించారు. పాడేరులో ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతో, జిల్లా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎర్రయ్య, సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాస్, ఈఎన్‌టీ హెచ్ఓడీ డాక్టర్ రాజేశ్వరి, ఫోరెనిక్స్ హెచ్ఓడీ డాక్టర్ సుబ్బరావు, అర్థోపెడిక్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాస్, ఆర్ఎంవో డాక్టర్ వెంకట్, ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ అనూప్, అసోసియేట్ ప్రొఫెసర్లు, నర్సింగ్ సూపరిండెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. డుంబ్రిగుడ మండలంలోని జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు. చింతపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నీలవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కూనవరంలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రాజీవ్, సర్పంచ్ నూపా వెంకన్నబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చింతపల్లి ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలవేణి


కరకగూడెంలో వైద్య శిబిరంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజీవ్


పాడేరులోని ర్యాలీలో పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత


కించుమండలో సూచనలిస్తున్న ఇమ్యూనైజేషన్ అధికారి కమలకుమారి